క్లుప్తంగా

మెనూ విధిగా పాటించాలి



పాన్‌గల్: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని డీఆర్డీఓ ఉమాదేవి ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని ఆమె సందర్శించి భోజనం, సరుకు నిల్వ గదిలోని కూరగాయలు, పరిసరాలను తనిఖీ చేశారు. ఫిర్యాదు పెట్టెలోని పిర్యాదులను పరిశీలించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కోతుల బెడద, అసంపూర్తి ప్రహరీ నిర్మాణం, మురుగు ప్రహరీ సమీపంలో నిల్వ ఉండటాన్ని ఆమె గుర్తించారు. పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గురుకులాన్ని ప్రత్యేక అధికారి తనిఖీ



గోపాల్‌పేట: మండలంలోని బుద్దారం గురుకుల పాఠశాలను గురువారం స్పెషలాఫీసర్ డీపీఓ శ్రీనివాస్‌గౌడ్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలను విద్యార్థుల కోసం మెయిన్‌టెయిన్ చేస్తున్న మెనూ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. విద్యార్థులకు ఏ ఇబ్బందులు ఉన్నా పాఠశాలలో కంప్లైంట్‌బాక్స్‌లో ఫిర్యాదు చేయొచ్చన్నారు. తానే సమస్య చూసి పరిష్కారం చేస్తానన్నారు.

వ్యక్తి బైండోవర్.. కేసు నమోదు

చిన్నచింతకుంట: గణేష్ నిమజ్జనంలో మైక్ సౌండ్ పెంచారని ఉద్రేకానికి గురై ఓ వ్యక్తి ఇద్దరు యువకులపై దాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట గురువారం హాజరుపర్చారు. సీసీకుంటకు చెందిన చంద్రన్న వినాయక నిమజ్జనంలో మైక్‌సౌండ్ పెంచారని, అదే గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్, అర్జున్ కుమార్‌లపై దాడికి పాల్పడ్డారు. అందుకు బాధితులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై రాంలాల్‌నాయక్ బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చారు.

నీటి వృథా.. అరికట్టేది ఎలా..?



అమరచింత: ప్రతిరోజూ పట్టణంలోని ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి తాగునీరు వృథాగా పారుతున్న సంబంధిత అధికారులు నీటివృథాను అరికట్టలేని స్థితిలో ఉన్నారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా అధికారులు ఒక పక్క సత్వర చర్యలు తీసుకుని మరమ్మతులు చేపడుతుంటే రహదారులపై వృథాగా పారుతున్న నీటిని అరికట్టలేక పోతున్నారు. పట్టణంలోని దశమికట్ట సమీపంలోని భగీరథ ట్యాంకులతో పాటు హైస్కూల్ ఆవరణలో ఉన్న ట్యాంకులు నీటితో నిండుకుని ఓవర్‌ఫ్లో ద్వారా తాగునీరు రహదారులపై పారుతున్నది. ఇప్పటికైనా నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

బాధ్యతలు స్వీకరణ

ఖిల్లాఘనపురం: ప్రభుత్వం నూతనంగా నియమించిన గ్రామపాలనా అధికారులు గురువారం మండలంలో బాధ్యతలు తీసుకున్నట్లు తహసీల్దార్ సుగుణ తెలిపారు. మండలంలో మొత్తం 11 క్లస్టర్‌లు ఉండగా మండలానికి 7మంది గ్రామపాలనా అధికారులను కలెక్టర్ కేటాయించినట్లు ఆమె తెలిపారు. వారిలో మల్కాపురం క్లస్టర్‌కు పావని, సోళీపురానికి శశికళ, షాపురంకు బుచ్చమ్మ, అప్పారెడ్డిపల్లికి మైమూద్, ఉప్పరిపల్లికి యాదయ్య, కమాలొద్దీన్‌పూర్‌కు అంజనేయులు, అల్లమాయపల్లికి కృష్ణయ్యను కేటాయించామన్నారు.

సతీష్‌యాదవ్‌కు సన్మానం



కొత్తకోట రూరల్: డాక్టరేట్ గిడుగు రామ్మూర్తి అవార్డులు అందుకున్న అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ డాక్టర్ సతీష్ యాదవ్‌కు కొత్తకోటలో ఘనసన్మానం లభించింది. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.విశ్వేశ్వర్, మాజీఎంపీపీ గుంత మౌనిక, రవీందర్‌రెడ్డి, సత్యంయాదవ్, వినోద్ సాగర్, ఎల్ఐసీ కృష్ణయ్యగౌడ్, జావిద్, హోటల్ కురుమూర్తి, ఖాజ, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

మొక్కజొన్న రైతు చిత్తు



చిన్నంబావిలో చీడపీడలతో దెబ్బతిన్న మొక్కజొన్న పంట

- అతివృష్టి, అనావృష్టితో ఆందోళన
- తెగుళ్లు, చీడపీడలతోనే పంట నష్టం

చిన్నంబావి: ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగు చేస్తే ఎంతో లాభాదాయకంగా ఉంటుందని ఆశించిన రైతులకు నిరాశే ఎదురవుతోంది. రైతులు పొలంలో కష్టించి పని చేయడంతో పాటు, ఎన్నో అప్పులు చేసి వేలాది ఎకరాల్లో మక్క వేసినప్పటికీ తెగుళ్లు రావడంతో నిరాశ చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న విత్తనాలు మొలకెత్తి ఏపుగా పెరిగినప్పటికీ తెగుళ్ల సోకడంతో నిరాశకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు తెగుళ్ల బారిన పడి మొక్కలు కుళ్లిపోతున్నాయి. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరుతున్నారు. చిన్నంబావి మండలంలో ప్రధానంగా వరి మొక్కజొన్న మినుము పంటలను రైతులు ఎక్కువగా సాగు చేస్తూ ఉంటారు. వానాకాలంలో మొక్కజొన్న వేస్తే లాభాదాయకంగా ఉంటుందని ఉద్దేశంతో మండలంలో పెద్దదగడ, పెద్దమారు, కొప్పునూరు, లక్ష్మీపల్లి, అయ్యవారిపల్లి, వెల్టూరు, చిన్నమారు,



చిన్నంబావిలో సాగు చేసిన మొక్కజొన్న పంట

బూగెం, బెక్కం గ్రామాల్లో దాదాపు 7వేల ఎకరాలకు పైగా మొక్కజొన్నను రైతులు సాగు చేశారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కొంతమంది రైతులు వేసిన మొక్కజొన్న విత్తనాలు మొలకలు వచ్చి కుళ్లిపోయాయి. మరికొంతమంది రైతులు పొలంలో వేసిన విత్తనాలు మొలకలు వచ్చి ఏపుగా పెరిగినప్పటికీ తెగుళ్ల బారిన పడి కుళ్లిపోతుండటంతో రైతులు దిగులు చెందుతున్నారు. అప్పులు చేసి రూ.వేలతో పెట్టుబడి పెట్టిన రైతులు నష్టాలు చవి చూడటంతో ఆందోళన చెందుతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడి రాకపోయిన కనీసం విత్తనాలు ఖర్చు అయిన రాదని తెలిసి రైతులు కన్నీరు పెడుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కౌలుకు తీసుకొని మొక్కజొన్న సాగు చేసినప్పటికి పంటనష్టం రావడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

చీడపీడలతో పంట నష్టం



నేను ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటను సాగు చేశాను. పంట విత్తుకున్న దశలో సాగునీరు సరిగా అందలేదనుకున్న సమయంలో విపరీతమైన వర్షాలు రావడంతో రెండు ఎకరాల్లో పంట నాశనం అయింది. మిగతా భూమిలోనైనా పంట చేతికొస్తుందనుకుంటే అకాల వర్షాలు రావడంతో చీడపీడలతో పంట మొత్తం నాశనమైంది.

–మహేష్, లక్ష్మీపల్లి గ్రామం

విత్తనాల ఖర్చు వస్తే బాగుండు

ఈ ఏడాది భారీ ఆశలతో మొక్కజొన్నను సాగు చేశాను. కానీ అతివృష్టి, అనావృష్టి కూడా రెండే ఒకే కాలంలో రావడం మాకు భారీగా నష్టాలను మిగిల్చింది. పైగా పంటపై పురుగుల బెడద ఎక్కువగా ఉండటం వల్ల కనీసం విత్తనాల ఖర్చు అయిన వస్తే బాగుండు.

–శేఖర్‌గౌడ్, పెద్దదగడ గ్రామం

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

మంత్రి వాకిటి శ్రీహరి



మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి వాకిటి

అమరచింత: అనారోగ్యంతో నందిమళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖర్‌రెడ్డి(40) గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి వాకిటి శ్రీహరి గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. చంద్రశేఖర్‌రెడ్డి మృతదేహంపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. చంద్రశేఖర్‌రెడ్డి మృతి పార్టీకి తీరని లోటన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కేశం నాగరాజ్‌గౌడ్, నాయకులు ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, అరుణ్‌కుమార్, మార్కెట్‌చైర్మన్ రహమతుల్లాతో పాటు పలువురు పాల్గొన్నారు.

'నిరుద్యోగులకు క్షమాపణ చెప్పాలి'



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్‌వీ ప్రతినిధులు

వనపర్తి విద్యావిభాగం: గ్రూప్–1లో అవకతవకలపై సీఎం బాధ్యత వహించి నిరుద్యోగులకు క్షమాపణలు చెప్పాలని బీఆర్ఎస్‌వీ జిల్లా అధ్యక్షుడు హేమంత్ ముదిరాజ్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రూప్–1 పోస్టులపై అవకతవకలకు బాధ్యత వహించి, నిరుద్యోగ యువతకు క్షమాపణ చెప్పాలని, పరీక్షను మళ్లీ నిర్వహించాలన్నారు. కాగా న్యాయపరమైన దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు భాగ్యరాజ్, కవిత నాయక్, లక్ష్మణ్, శివ, సిరివాటి శంకర్, మన్సూర్, రాజేష్, చంద్రశేఖర్, మైనారిటీ అధ్యక్షుడు జోహెబ్, యువ నాయకులు చిట్యాల రాము, వెంకట్‌సాగర్, గొర్లప్రేమ్, అలీం తదితరులు పాల్గొన్నారు.

పోషణ్‌ట్రాకర్ యాప్‌పై అవగాహన



యాప్‌పై అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్లు

పాన్‌గల్: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు గురువారం పోషణ్ ట్రాకర్ యాప్, ఆన్‌లైన్ నమోదుపై అవగాహన కల్పించారు. యాప్‌లో అంగన్‌వాడీ కేంద్రాల కార్యకలాపాలు, కార్యకర్తల సేవలు, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, పిల్లలు, కౌమార బాలికల వివరాలు నమోదు చేస్తారన్నారు. బీఎల్ఓలకు పీడబ్ల్యూడీ పెన్షన్‌లిస్టుకి పీడబ్ల్యూడీ ఓటర్ జాబితా అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చి ట్యాలీ చేయించాలన్నారు. పెన్షన్‌లిస్టులో ఉన్న వారందరికి ఓటర్‌జాబితాలో పేర్లు లేకుంటే వాళ్లకి కొత్తగా ఓటునమోదు చేయించాలని సూచించినట్లు సూపర్‌వైజర్లు పేర్కొన్నారు. సమావేశంలో సూపర్‌వైజర్లు షాహీన్‌బేగం, సబితా, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



చట్టాలపై అవగాహన కల్పిస్తున్న కృష్ణయ్య

వనపర్తిటౌన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ డి.కృష్ణయ్య అన్నారు. ఈ మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి వి.రజని ఆదేశాలతో గురువారం జిల్లా కేంద్రంలోని లిటిల్‌బర్డ్స్ హై స్కూల్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చట్టాల అవగాహనతో న్యాయ, అన్యాయాలకు తేడా తెలుస్తుందని, చట్టాలు తెలవడంతో తప్పుదారిలో పోకుండా ఉండేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కొన్ని సందర్భాల్లో చేసిన తప్పునకు మూల్యం ఏంటో తెలీక తప్పుల మీద తప్పులు చేస్తారని, చట్టాలతో అవగాహనతో మూల్యం ఏంటో తెలిస్తే నేరాలు తగ్గుతాయన్నారు. విద్యార్థులకు బాల్యవివాహాల నిషేధ చట్టం, బాల కార్మికుల నిర్మూలన చట్టం, మోటర్ వెహికల్ చట్టం, ఉచిత, నిర్బంధ విద్యహక్కు చట్టం, పోక్సో యాక్ట్‌లపై అవగాహన కల్పించారు. ఉచితన్యాయ సలహాల కోసం 15100 టోల్ ఫ్రీ నంబర్‌కు సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆంగ్లంపై ఆసక్తి పెంపొందించుకోవాలి

మదనాపురం: విద్యార్థులు ఇంగ్లిష్ సబ్జెక్టుపై ఆసక్తి పెంచుకోవాలని కాంప్లెక్స్ హెచ్ఎం మూలే ఆంజనేయులు అన్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, దుప్పల్లి కాంప్లెక్స్ ఆధ్వర్యంలో గురువారం ఇంగ్లిష్‌పై మదనాపురం, ఆత్మకూరు, అమరచింత, మండలాల ఉపాధ్యాయులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కాంప్లెక్స్ హెచ్ఎం మాట్లాడుతూ.. ఇంగ్లిష్ సబ్జెక్టుపై విద్యార్థులకు ఆసక్తి పెంచేవిధంగా బోధన చేయాలన్నారు. చదవడం, రాయడంలో మెలకువలు అలవర్చేలా ఉపాధ్యాయులు శ్రమించాలన్నారు. అదేవిధంగా ప్రతిరోజూ 30 నిమిషాల పాటు 'బుక్ రీడింగ్ పీరియడ్'ని అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాజశేఖర్, వెంకటేష్‌నాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

జోరువాన.. వాహనదారుల ఇక్కట్లు



పాన్‌గల్‌లో అలుగు పారుతున్న పాల్కి చెరువు



రాజనగరం డ్యాంపై నీరు ప్రవహిస్తుండడంతో బారికేడ్లును పెట్టిన పోలీసులు

వనపర్తి రూరల్: గురువారం ఉదయం కురిసిన భారీ వర్షానికి మరికుంట చెరువు అలుగు పారుతుండంతో రోడ్డుపై నీరు ఉధృత్తంగా ప్రవహిస్తుండడంతో వనపర్తి నుంచి పెబ్బేరు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందిగా మారింది. దీంతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. అమ్మచెరువు అలుగు పారుతుండంతో వనపర్తి నుంచి పెద్దమందడి వెళ్లే దారిలో వడ్డెగేరి దగ్గర రోడ్డు డ్యాంపై, రాజనగరం గ్రామానికి వెళ్లే దారిలోని రోడ్డు డ్యాంపై నీరు ఉధృతంగా ప్రవహిస్తుడంతో వాహనాలను నిలిపివేశారు. పోలీసులు అక్కడి చేరుకొని వాహనాల రాకపోకలను ఆపి నీటిఉధృతి తగ్గిన తర్వాత పంపించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని హై లెవల్ వంతెనలు నిర్మాణాలు చేపట్టాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



విద్యార్థులకు సూచనలు చేస్తున్న డీఐఈఓ అంజయ్య

ఖిల్లాఘనపురం: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని డీఐఈఓ అంజయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్బాను పరిశీలించారు. ఈ సందర్భంగా భోజనం ఉపయోగించే సరుకులు, తరగతి గదులు, పాఠశాల పరిసరాలు తదితర వాటిని పరిశీలించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో వేరువేరుగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. నిత్యం భోజనం సమయంలో శుభ్రత పాటించేలా సూచనలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

'లోకాయుక్తకు తప్పుడు నివేదిక ఇచ్చిన కమిషనర్'

వనపర్తిటౌన్: గత ప్రభుత్వ హయాంలో వనపర్తి మున్సిపాలిటీ తీసుకున్న స్వీపింగ్ మిషన్, రోడ్లు విస్తరణకు అద్దెకు తెచ్చిన జేసీబీ, ట్రాక్టర్ల లెక్కల్లో అక్రమాలు జరిగాయని ఉద్యమకారుల ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి మండ్ల దేవన్ననాయుడు గురువారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఈ మేరకు ఆయన లోకాయుక్తకు ఫిర్యాదు చేయడంతో మున్సిపల్ కమిషనర్ తప్పుడు నివేదిక ఇచ్చారని లోకాయుక్త కలెక్టర్‌కు, కమిషనర్‌కు నోటీసులు జారీ చేశారని తెలిపారు. కమిషనర్ వెంకటేశ్వర్లు నామమాత్రపు వివరాలు సమర్పించారని, సమగ్ర నివేదిక ఎందుకు ఇవ్వలేదని, అక్రమదారులను తప్పించే ప్రయత్నం చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్, అధికారులు, కమిషనర్, చైర్మన్‌పై చర్యలు తీసుకోవాలని లోకాయుక్తను కోరుతానని, అదేవిధంగా ఈనెల 16న విచారణ ఉందని పేర్కొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

ఆత్మకూర్: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో ఉంటున్న విద్యార్థులకు నాణ్యమైన భోజనం ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ చికినే శశిధర్ అన్నారు. గురువారం పట్టణంలో బీసీ, ఎస్సీ వసతి గృహాన్ని కమిషనర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను, విద్యార్థుల హాజరుశాతాన్ని తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డెన్ రఫీక్, వార్డుల అధికారులు తదితరులు ఉన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

వనపర్తి రూరల్: పెబ్బేరు మండలంలోని మోడల్ పాఠశాల్లో విజయలక్ష్మి మండల ఉత్తమ ఉపాధ్యాయురాలుగా పురస్కరించారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ డా. తూర్పుంటి నరేష్‌కుమార్, ఉపాధ్యాయులతో కలిసి శాలువతో ఆమెను సన్మానించారు. అనంతరం ప్రిన్స్‌పాల్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు పురస్కారం లభించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోటలో పాఠశాల సీజ్

కొత్తకోట: పట్టణ సమీపంలో మదనాపురం రోడ్‌లో నూతనంగా స్థాపించిన శ్రీ చైతన్య స్కూల్ నిబంధనలకు విరుద్ధంగా నడుస్తుందన్న సమాచారంతో జిల్లా విద్యాధికారి అబ్దుల్‌ఘనీ ఆదేశానుసారం ఎంఈవో కృష్ణయ్య సిబ్బందితో కలిసి ఈనెల 10న పాఠశాల దగ్గరకు వెళ్లారు. పాఠశాల ప్రిన్సిపాల్‌తో పాటు పలువురు స్థానిక నాయకులు విద్యాశాఖ అధికారులను అడ్డుకున్నారు. గురువారం స్థానిక ఎస్ఐ ఆనంద్ దృష్టికి తీసుకెళ్లగా విద్యాశాఖ అధికారులకు ఎస్ఐ భద్రత కల్పించగా స్కూల్ దగ్గరకు పోలీసులతో విద్యాశాఖ అధికారులు వెళ్లి పాఠశాలను సీజ్ చేసినట్టు ఎంఈవో తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పాఠశాలపై చట్టపరంగా చర్యలు తీసుకుని గుర్తింపు రద్దు చేయడం జరుగుతుందని ఎంఈవో హెచ్చరించారు.

మండలానికి 8 మంది జీపీఓల కేటాయింపు



తహసీల్దార్‌కు జాయినింగ్ ఆర్డర్ కాపీని అందజేస్తున్న జీపీఓలు

పాన్‌గల్: మండలానికి మొత్తం 8 మంది నూతన జీపీఓలను కేటాయించినట్లు తహసీల్దార్ సత్యనారాయణరెడ్డి అన్నారు. మండలానికి కేటాయించిన 8 మంది జీపీఓలు గురువారం విధుల్లో చేరారని మండలంలో మొత్తం 10 రెవెన్యూ క్లస్టర్లు ఉండగా వాటిలో 8 క్లస్టర్లకు జీపీఓలను కేటాయించారన్నారు. పాన్‌గల్ క్లస్టర్‌కు రాధ, కేతేపల్లికి ఉమావతి, బుసిరెడ్డిపల్లికి గొంది‌మల్లికార్జున్, దావాజీపల్లికి రాములు, గోప్లాపూర్‌కి కృష్ణవేణి, తెల్లరాళ్ళపల్లికి భాగ్యలక్ష్మి, మాందాపూర్‌కి నాగయ్య, రేమద్దులకు బాబును కేటాయించారన్నారు. వెంగళాయిపల్లి, శాగాపూర్‌కు కేటాయించలేదని ఈ క్లస్టర్లకు జూనియర్ అసిస్టెంట్లను నియమిస్తారా లేక కొత్తవారిని కేటాయిస్తారా అనే విషయాలు తెలియాల్సి ఉందన్నారు. సమావేశంలో డీటీ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి



ఎంపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

మదనాపురం: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలనీ కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీవో ప్రసన్నకుమారికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మండ్ల రాజు మాట్లాడుతూ.. రెండు నెలలుగా వేతనాలు అందక కార్మికులు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌ఛానల్ ద్వారా ప్రతినెలా వేతనాలు చెల్లిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినప్పటికీ, అమలు జరగకపోవడం బాధాకరమన్నారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, గుర్తింపుకార్డులు, యూనిఫాం వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. జీవో నెం.51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట రాములు, ప్రజానాట్యమండలి జిల్లా నాయకుడు వెంకటేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు చిరంజీవి, గ్రామ పంచాయతీ సంఘం నాయకులు ఖాదర్, అశోక్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు పరిశుభ్రతపై సూచనలు చేస్తున్న వైద్యాధికారి

ఖిల్లాఘనపురం: సీజనల్ వ్యాధులపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి ప్రవీణ్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలో పలు ప్రాంతాలను పరిశీలించి డెంగ్యూ సోకిన వ్యక్తిని కలిసి సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమలతో డెంగ్యూ, మలేరియా తదితర సోకే అవకాశం ఉందన్నారు. ప్రతిఒక్కరూ ఇళ్ల వద్ద పాత వస్తువులు ప్లాస్టిక్ వస్తువులు ఉంచుకోరాదన్నారు. కులాయి గుంతల్లో నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాల్లో కేవలం 10 రోజుల్లోనే నాలుగు డెంగ్యూ పాజిటివ్ కేసులు నమోదైందని ఆయన చెప్పారు. ఆయన వెంట వైద్యసిబ్బంది నర్సింహులు, మాధవి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల అగచాట్లు



ఆత్మకూర్‌లోని పీఏసీఎస్ వద్ద బారులు తీరిన రైతులు

ఆత్మకూర్: రైతులకు కావలసినంత యూరియా అందుబాటులో ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మండల వ్యవసాయాధికారి వినయ్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక పీఏసీఎస్ కార్యాలయం వద్ద 600 బస్తాల యూరియాను రైతులకు అందించామని, అలాగే పట్టణంలో ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో 150బస్తాల చొప్పున యూరియా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ నరేష్, ఏఈఓ మహేష్ ఉన్నారు.

900 యూరియా బస్తాల పంపిణీ

పాన్‌గల్: మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయంలో గురువారం రోజు 900 బస్తాల యూరియాను పంపిణీ చేసినట్లు సింగిల్ విండో కార్యాలయ అధికారులు పేర్కొన్నారు. వర్షంలోనూ మూడురోజుల క్రితం టోకెన్లు పొందిన 280మంది రైతులు, గురువారం వచ్చిన వారికి కూడా యూరియా పంపిణీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. యూరియా కోసం 195 మంది రైతులు పట్టదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌ను కార్యాలయంలో అందజేశారు.



పాన్‌గల్ సింగిల్‌విండో కార్యాలయం ఎదుట యూరియా కోసం క్యూలైన్‌లో రైతులు

యూరియా రైతుకష్టాలను తీర్చాలి

అమరచింత: రైతన్నలకు సకాలంలో యూరియాను అందించాలని రైతు సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్ డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ రవికుమార్‌యాదవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన కోటా ప్రకారం యూరియా, ఎరువులను వెంటనే సరఫరా చేయాలన్నారు. యూరియా కొరతతో అనేకమంది డీలర్లు 40 కిలోల బస్తాకు రూ.267 ఉండగా అదనంగా వసూలు చేస్తూ కృత్రిమకొరత సృష్టిస్తున్నారన్నారు. యూరియా కొరత లేకుండా చేయాలని, లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేస్తామన్నారు. వారివెంట అంజిరెడ్డి, రాజు, బాలకృష్ణ పాల్గొన్నారు.



అమరచింతలో తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న రైతుసంఘం నాయకులు